క్లుప్తంగా

ఘనంగా గంగానమ్మ సంబరాలు

ఏలూరు రూరల్: శనివారపుపేటలో ఆదివారం గంగానమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్థానిక జెడ్పీ పాఠశాల వద్ద ఆలయంలో ఉదయం గంగానమ్మకు పుణ్యస్నానాలు, హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం, పండ్లు, పువ్వులు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కోలాటం, భజనల మధ్య పోతురాజుబాబుతో పాటు భక్తులు పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ వైస్ ఎంపీపీ లంకపల్లి మాణిక్యాలరావు, కంది రంగబాబు, మాజీ ఎంపీటీసీ సోమిశెట్టి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

15న విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నగరంలోని విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వర రావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు ఐదు కన్సొలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వైఎంహెచ్ఏ హాలు కార్యాలయంలో 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90323 23632, 94930 59598 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.

ఈవ్ టీజింగ్ నుంచి కాపాడండి

ప్రభుత్వ కళాశాల హాస్టల్స్ విద్యార్థినుల వేడుకోలు

కొయ్యలగూడెం: ఈవ్ టీజింగ్ నుంచి తమల్ని కాపాడాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వద్ద ప్రభుత్వ ఎస్టీ కళాశాల హాస్టల్స్ విద్యార్థులు మొరపెట్టుకున్నారు. పరింపూడిలోని బాలికల ఎస్టీ హాస్టల్‌ను ఆయన ఆదివారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు తగినంతమంది హాస్టల్లో లేకపోవడం గురించి సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కళాశాల యువతులు, హైస్కూల్ విద్యార్థినులు తమ సమస్యలను ఎమ్మెల్యే వద్ద ఏకరువు పెట్టారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో హాస్టల్ గేట్ల ముందు జులాయిల ప్రవర్తనలతో విసుగు చెందుతున్నామని కళాశాలలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు చెబితే చదువు మానిపించేస్తారేమోనని భయంతో మిన్న కుండిపోతున్నామని ఎమ్మెల్యే వద్ద పేర్కొన్నారు. అదేవిధంగా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోందని, హాస్టల్లో ఫ్యాన్లు సౌకర్యం పూర్తిస్థాయిలో లేదని వాపోయారు. విద్యార్థినుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కాజ్‌వే కష్టాలు తీరేదెన్నడో...

- తమ్మిలేరుకు వదర పోటెత్తితే నగరవాసుల బెంబేలు
- శనివారపుపేట కాజ్‌వే మూసేయాల్సిన పరిస్థితి
- ఏటా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పూర్తిస్థాయి వంతెన నిర్మాణం చేపట్టాలని వేడుకోలు



ఏలూరు శనివారపుపేట కాజ్‌వేపై తమ్మిలేరు వరదనీటి ప్రవాహం (ఫైల్)



శనివారపు పేట కాజ్‌వే వద్ద ప్రస్తుత పరిస్థితి



ఏలూరు తమ్మిలేరుకు గతంలో నిర్మించిన రక్షణ గోడ

ఏలూరు టౌన్, టూటౌన్ : భారీ వర్షాలు, తుపాన్లు వస్తే.. ఏలూరు నగరంలో తమ్మిలేరుకు వరద పోటెత్తుతుంది. ఐదేళ్ల క్రితం వరకూ ఏలూరు తమ్మిలేరుకు వరద నీరు వస్తే చాలు నగరంలో జనం బెంబేలెత్తిపోయే పరిస్థితి ఉండేది. కానీ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో తమ్మిలేరు ఏటిగట్లకు రక్షణ గోడ నిర్మాణం చేపట్టటంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. కానీ ఇంకా పలు చోట్ల తమ్మిలేరు ఏటిగట్టుకు రివిట్‌మెంట్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇక మరీ ముఖ్యంగా శనివారపుపేట కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఏలూరు నగర ప్రజలు కోరుతున్నారు. పాలకులు ఈ అంశంపై దృష్టి సారించాలని అభిప్రాయపడుతున్నారు.

వీరి ప్రయాణం కాజ్‌వేపై నుంచే

శనివారపుపేట కాజ్‌వేపై నుండి తమ్మిలేరు అవతల ఉన్న నగరంలోని శ్రీరామ్ నగర్, గ్జేవియర్ నగర్, శనివారపు పేట, లునాని నగర్, దొండపాడు, శనివారపుపేట వంటి ప్రాంతాలతో పాటు దుగ్గిరాల, పినకడిమి, చినకడిమి, కొప్పాక మీదుగా నూజివీడు ప్రాంతాలకు వెళ్లేందుకు ఇదే మార్గం. దుగ్గిరాల డెంటల్ కాలేజ్, సెయింట్ ఆన్స్ కాలేజ్ వంటి ప్రముఖ విద్యా సంస్థలకు వెళ్లాలంటే ఇదే మార్గం. రోజుకు కనీసం 50 వేల మంది వరకూ ఈ కాజ్‌వే పై నుంచి రాకపోకలు చేస్తుంటారు. నూజివీడు వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు కూడా ఇదే మార్గం గుండా వెళ్లి వస్తుంటాయి. జాతీయ రహదారి నుంచి దుగ్గిరాల మీదుగా ఏలూరు నగరంలోకి వాహనదారులు ఇదే మార్గం నుంచి వస్తుంటారు.

కాజ్‌వే మూసేస్తే ఇబ్బందులే...

తమ్మిలేరు పశ్చిమ పాయ ఇటువైపుగా ప్రవహిస్తూ ఉండడంతో వరదల సమయంలో ఎగువ ప్రాంతంలో నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు నుంచి వరద నీటిని విడుదల చేస్తే శనివారపుపేట కాజ్‌వే మూసివేయాల్సి వస్తోంది. గత మూడు రోజుల క్రితం రెండు రోజుల పాటు పోలీస్ బందోబస్తుతో బారికేడ్లు ఏర్పాటు చేసిమరీ రాకపోకలు నిలిపివేశారు. దీంతో శనివారపుపేట వైపు నుంచీ ఏలూరు నగరంలోకి రావాలంటే గ్జేవియర్ నగర్ మీదుగా త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, కొత్త బస్టాండ్ వద్ద బ్రిడ్జి మీదుగా వాహనాలు రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ బ్రిడ్జి సైతం చిన్నగా ఉండడంతో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. నగరంలో భారీగా జనాభా పెరిగిపోవటం, వాహనాల సంఖ్య వేలల్లోకి చేరటం కారణంగా రోడ్లన్నీ వాహనాలతో రద్దీగా మారిపోయాయి. తీవ్రస్థాయిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

తమ్మిలేరు రక్షణ గోడ నిర్మించాలి

ఏలూరు నగరంలో తూర్పు, పశ్చిమ పాయలుగా ప్రవహిస్తున్న తమ్మిలేరు ఉగ్రరూపం దాల్చితే నగర ప్రజలు వరదలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉండేది. కానీ దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ మొదటి దశలో రూ.18 కోట్లతో రివిట్‌మెంట్ పనులు చేయించగా, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రూ.80 కోట్లతో రెండవ దశ తమ్మిలేరు ఏటిగట్లు రక్షణ గోడ నిర్మాణ పనులు పూర్తి చేయించారు. మూడవ దశలో మరో రూ.25 కోట్లతో మిగిలిన ప్రాంతాల్లో రివిట్‌మెంట్ పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో వంతెన నిర్మించాలి



శనివారపుపేట కాజ్‌వే స్థానంలో పూర్తిస్థాయిలో వంతెన నిర్మించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఏటా వర్షాకాలంలో తమ్మిలేరు ఉధృతిగా ప్రవహించినప్పుడు, వరద వచ్చినప్పుడు ఏలూరు నగరంలో మొదటిసారిగా ప్రభావం చూపేది ఈ కాజ్‌వేపైనే. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం కాజ్‌వే స్థానంలో పూర్తి స్థాయి వంతెనను నిర్మించాలి.

– గొట్టాపు రవికిషోర్, మాజీ ఎంపీటీసీ

ఏటా ఇబ్బందులు తప్పడం లేదు



ప్రతి ఏటా తమ్మిలేరు పొంగినప్పుడల్లా ఏలూరు నగరంలోకి వెళ్లేందుకు స్థానికంగా ఉండే తాము ఎంతో ఇబ్బంది పడుతున్నాం. దుగ్గిరాల డెంటల్ కాలేజీకి వెళ్లే రోగులు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వివిధ పనుల నిమిత్తం ఏలూరు నగరంలోకి వచ్చి తిరిగి ఇంటికి వెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదు. తక్షణం వంతెన నిర్మించాలి.

కె.రామాంజనేయులు, సీపీఎం నగర కమిటీ సభ్యులు

గుర్రపుడెక్క తొలగించాలి



తమ్మిలేరుకు వదరలు వస్తే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. తమ్మిలేరులో గుర్రపుడెక్క పేరుకుపోవటంతో వరదనీటి ప్రవాహం ఎక్కువైతే తమ్మిలేరుపై కొత్తబస్టాండ్ బ్రిడ్జి, బాలయోగి వంతెన, తంగెళ్లమూడిలోని బ్రిడ్జిలు వద్ద నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి వదర ఉధృతి పెరిగిపోతుంది. దీనిపై అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

– ఎం.రవీంద్ర, వ్యాపారి, ఏలూరు

తమ్మిలేరుకు రివిట్‌మెంట్ నిర్మాణం చేపట్టాలి



తమ్మిలేరుకు వరదలు వస్తేనే అధికారులకు తమ్మిలేరుపై శ్రద్ధ వస్తుంది. తమ్మిలేరులో అశోక్‌నగర్ బ్రిడ్జి ప్రాంతం నుంచీ తంగెళ్ళమూడి వంతెన వరకూ తుమ్మచెట్లు భారీగా పెరిగిపోయాయి. వరదనీటి ప్రవాహానికి అడ్డంకిగా మారటంతో ఇళ్లలోకి వరదనీరు వెళ్లే ప్రమాదం ఉంది. తమ్మిలేరు ఏటిగట్లకు మిగిలిన ప్రాంతాల్లోనూ రివిట్‌మెంట్ నిర్మించాలి. శనివారపుపేట కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణం చేయాలి.

– కే.రవికృష్ణ, ఏలూరు

అధికారం కోసమే చంద్రబాబు హామీలు

బుట్టాయగూడెం: ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్సం లత, వెట్టి భారతి డిమాండ్ చేశారు. మండలంలోని దొరమామిడిలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సంపద సృష్టిస్తామని చెప్పి ఇప్పుడు నిధుల కొరత వెంటాడుతుందంటూ చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు అధికారం కోసమే హామీలు ఇచ్చారే తప్ప మహిళలపై ప్రేమతో కాదన్నారు. మద్యం పాలసీ వల్ల మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అయితే ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన ఆర్థిక వనరుగా ఎంచుకోవడం సిగ్గుచేటని అన్నారు. మద్యాన్ని నిషేధించి ప్రజలకు ప్రాణరక్షణ కల్పించాలని అన్నారు. లేనిపక్షంలో మహిళా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఇందుకోసం అక్టోబర్ నెలలో జిల్లా మహాసభలు నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు ఈమని మల్లిక, కారం అరుణ, ధర్మల లక్ష్మి, తగరం సత్యవతి, సరియం అనిత, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 16వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.సుమతి చెప్పారు. ఆదివారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించి సమస్యలపై అర్జీలను ప్రజలు తనకు అందించవచ్చని అన్నారు. ప్రతిరోజూ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ సదస్సులు జరుగుతాయని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ

గణపవరం: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆదివారం తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈశిక్షణ మూడురోజుల పాటు 12, 13, 14 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జరుగుతుందన్నారు. ఈశిక్షణకు అన్ని గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్1 నుంచి గ్రేడు 5వరకూ హాజరుకావాలని కోరారు.

విజిలెన్స్ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఆదివారం విజిలెన్స్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమగా రేషన్ బియ్యం కలిగి ఉన్న చావా రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.4,680 విలువైన 117 కేజీల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ డీటీ వైపీ లక్ష్మీకుమారి తెలిపారు.

జూదరుల అరెస్ట్

కామవరపుకోట: మండలంలో పేకాట స్థావరంపై దాడి పోలీసులు దాడి చేశారు. వడ్లపల్లి గ్రామ శివారులో ఆదివారం పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్సై జయబాబు తన సిబ్బందితో దాడి చేసి, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.6,950 నగదు, ఏడు మోటర్ సైకిళ్లు సీజ్ చేసినట్లు చెప్పారు. ఈమేరకు

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



ఏలూరు టూటౌన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ ప్రభాకర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే నేరస్తులు, రౌడీషీటర్లకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ కౌన్సెలింగ్ చేపట్టారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాల్లోనూ, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విషయాల్లో జోక్యం చేసుకుంటే సహించేదిలేదని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. జిల్లాలో ఇష్టారాజ్యంగా నేరాలకు పాల్పడితే చట్టం మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి మంచి ప్రవర్తనతో జీవించాలని, మీ కుటుంబ సభ్యులను, పిల్లలను దృష్టిలో పెట్టుకుని నేరాలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. సమాజంలో మీ కుటుంబాలు గౌరవంగా జీవించేలా ఉపాధి మార్గాలు చూసుకోవాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న దళిత సేన నాయకులు

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని దళిత సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ కోరారు. స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని దళిత సేన ఏలూరు నగర కమిటీ సమావేశం జిల్లా దళిత సేన మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ లావేటి ప్రవళిక అధ్యక్షతన ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవిప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద బాధితులు చేసే ఫిర్యాదులపై విచారణ అనే పేరుతో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఆలస్యం చేస్తున్నారన్నారు. దీనివల్ల బాధితులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా సీఎం చంద్రబాబు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ కేసుల విషయంలో బాధితులకు చట్ట ప్రకారం ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులను తక్షణమే చెల్లించేలా మార్గ నిర్దేశం చేయాలని కోరారు. సమావేశంలో ఏలూరు నగర దళిత సేన మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి మధులత, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీని సన్మానించిన వర్జీనియా రైతులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌ను వర్జీనియా రైతు సంఘాల నాయకులు ఆదివానం ఏలూరులో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ అదనంగా పండిన పంటకు అపరాధ రుసుములేకుండా కొనుగోలు చేయాలని ఎంపీని కోరినట్లు తెలిపారు. దీంతో రాజమండ్రి ఎంపీ పురందేశ్వరితో కలిసి ఇటీవల దేవరపల్లిలో జరిగిన వర్జీనియా రైతుల అవార్డు వేడుకల్లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు రైతు సమస్యను తెలియజేసి అనుమతులు వచ్చేలా కృషిచేశారన్నారు. దీంతో అదనంగా పండిన పంటను ఎటువంటి అపరాధ రుసుము లేకుండా అమ్ముకోగలిగామని రైతు సంఘాల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘాల నాయకులు పరిమి రాంబాబు, సత్రం వెంకట్రావు, కాకర్ల నంది, ఇల్లూరి రాంబాబు, శ్రీనివాసరావు, కరాటం రెడ్డినాయుడు, వామిశెట్టి హరిబాబు, కూచిపూడి రమేష్, వీవీఎస్ ప్రకాశరావు, అట్లూరి సతీష్, గూడూరి నాగరాజు, బిక్కిన వెంకటేశ్వరరావు, సింహాద్రి శ్రీను, కాకర్ల శేషు, గద్దే శ్రీధర్ తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమిపై ప్రచారం



త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలతో ప్రచారం నిర్వహిస్తున్న సమితి సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందూ సమాజంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా నిర్వహించే ఊరేగింపు విశిష్టతపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. స్థానిక తంగెళ్ళమూడిలోని యాదవ నగర్‌లో నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో తాడేపల్లిగూడెం కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ రూపంలో జన్మించిన పరమాత్ముడు శ్రీకృష్ణుడు అని, ఆయన గురించి సమాజానికి తెలియజేయడానికే ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పూర్వం శ్రీ కృష్ణ జన్మాష్టమికి 11 రోజుల పాటు ఊరేగింపు నిర్వహించేవారని, చివరి రోజున చవితి నాడు ఊరేగింపు ముగించేవారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.కోటేశ్వరరావు, సీహెచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	30–80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	7,10
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	50	బీట్‌రూట్	36
కాకర కాయలు	40	కీరా దోస	50
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	36	అల్లం	100–160
క్యాబేజీ	26–28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36–56	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	40	గోంగూర	07
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	20–28	బఠాణీ	--
అనబకాయ (1)	15–20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	48

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	22
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	16
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

100 మందికి కంటి పరీక్షలు

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెంలో గ్రామంలో ఫర్ ద పీపుల్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. నిడదవోలుకు చెందిన రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్ర వైద్యశాల వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. 100 మందికి పరీక్షలు నిర్వహించి 20 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ కలపర్తి విజయ్, రెల్ల మోషే, గుండె ప్రవీణ్‌కుమార్, రవి, గాంధీ, వీర్రాజు, సురేష్, మోషే పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని వినతి

కొయ్యలగూడెం: కాంట్రాక్ట్ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాల్సిందిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు వినతిపత్రం అందజేశారు. కొయ్యలగూడెం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా ఆయన్ను కాంట్రాక్ట్ అధ్యాపకులు కలుసుకొని తమ సమస్య గురించి వివరించారు. గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 40 మంది వరకు పోలవరం నియోజకవర్గంలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తూ ఉన్నామన్నారు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి తమతో సహా రాష్ట్రంలో ఉన్న 3600 మంది కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలని కోరారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిల దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యను పరిష్కరించాల్సిందిగా వారు కోరారు. డి.జ్యోతిర్మయి, పి.విక్రమ్, ఎం.సుజాత, ఎ.హిమబిందు, ఏపీ వీరభద్రం, పి.అనంతలక్ష్మి, కె.రాధాకృష్ణ, కె.నాగేశ్వరరావు, ఎం.సోమరాజు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయండి

చింతలపూడి: సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బాబు మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల సంపదను దేశంలోని కష్ట జీవుల అభ్యున్నతికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం జాతీయ సమ్మేళనాల్లో కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు. ఈ జాతీయ సమ్మేళనాలకు దేశ వ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. సెప్టెంబర్ 3 వ తేదీన వేలాది మందితో ప్రదర్శన ఉంటుందని చెప్పారు. ప్రదర్శనకు అన్ని రంగాల కార్మికులు హాజరై విజయవంతం చేయాలన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె విష్ణుష్, భజంత్రీ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని కోరారు. పట్టణ జనాభా ప్రాతిపదికన కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెలగాడు అనురాధ, రాము, వడిత్య బాలు, బొత్స రాజేష్, శ్రీరాముల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో మెలగాలి

భీమడోలు: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని విద్యార్థి దశ నుంచి అలవర్చుకోవాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం «చదవడం మాకిష్టం» అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పుస్తక పఠనం చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ చిన్నారులకు నీతి కథలు, విద్యాబుద్ధులను నేర్పించారు. ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈనెల 13 నుంచి స్వాతంత్ర్యోద్యమ వేడుకలను దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి ఇంటా జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. జాతీయ నాయకులు, త్యాగధనుల జీవితాన్ని స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌వీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జోలికి వస్తే తడాఖా చూపిస్తాం

దెందులూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం జోలికి వస్తే భరతం పడతామని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు బొడ్డేటి స్టాలిన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సంఘ విద్రోహశక్తులు విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం చేసేలా చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. అంబేడ్కర్ అన్ని వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణకు రాజ్యాంగాన్ని రచించారన్నారు. కాని దీనికి భిన్నంగా దళితుల మనోభావాలు దెబ్బతినేలా అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడం సహించబోమన్నారు.